# మాష్టారు చెప్పిన కథ!

★



(రచయిత)

* రచన : శ్రీ కవుల ఆంజనేయశర్మ *

సాయంత్రం ఆరున్నర గంటలయింది. కుమారుడు సత్యం అప్పటివరకు బడినుండి యింటికి రాకపోయేసరికి ఏమయ్యాడో అన్న భయం కలిగింది తల్లిదండ్రులకి. స్కూలు వదలగానే యింటికి వచ్చి, శుభ్రంగా స్నానం చేసి, తల దువ్వుకొని, టిఫెన్ తిని ప్రయివేటుకి వెళ్ళే సత్యం, ఆ రోజు యింటికి రాకపోవటం ఎందుకో తెలియలేదు. పాలేరుని పంపేరు వెతకటానికి. ఒక్కగంట కన్నకొడుకు కనిపించకపోతే తల్లిదండ్రుల మనస్సు ఎంతో కలత చెందుతుంది. వారికి ఏమీ తోచదు. బిడ్డ పైనే మనస్సు. ఏమయ్యాడో అన్న భయం. ఆందోళన వారిని పీడిస్తుంది. ఇంటికి వచ్చేవరకు వారి మనస్సు మనస్సులో వుండదు. ఎంతయినా కన్న హృదయాలు కదా! 'బిడ్డలపై వుండే మమకారం, తీపి అంత. పాలేరువల్ల ఎక్కడా సత్యం కనకనబడలేదని విని మరింత ఆందోళన చెందేరు ఆ తల్లిదండ్రులు. వెనక్కి చేతులు కట్టుకొని, ఏదో ఆలోచిస్తూ వరండాలో అటూ యిటూ పచార్లు చేయసాగేడు తండ్రి రమణారావు. ఇంతలో 'అదుగో సత్యం' అంది శాంతమ్మ. ఆ మాట వినగానే ఆలోచిస్తున్న రమణారావు ఆత్రుతగా తల ఎత్తేడు. రేగిన జుట్టుతో, కొద్దిగా మాసిన బట్టలతో యింటికి వస్తున్న సత్యాన్ని చూడగానే వారి మనస్సు కొంత శాంతించింది. సత్యం యింట్లోకి వచ్చేడు.

'ఎక్కడికి వెళ్ళేవ్ బాబూ!' అంటూ అడిగాడు తండ్రి రమణారావు.

'టిఫెన్‌కి రాలేదేం? " బట్టలు అలా మట్టి అయాయేం?' అంది శాంతమ్మ.

సత్యం వారి ప్రశ్నలకు ఉక్కిరి బిక్కిరి అయ్యేడు. ఎంతో భయపడ్డాడు కూడా. అయినా ధైర్యం తెచ్చుకొని, 'స్కూలు నాలుగున్నరకు విడిచిపెట్టేరు. అప్పటికి యింకా నాకు ఆకలి వేయలేదు. అందుచేత ప్రయివేటుకి వెళ్ళి వచ్చేను. దాంతో యింత ఆలస్యం అయింది' అని చెప్పేడు.

'మా బాబే! ఎంత కంగారు పడ్డామో నువ్వు వేళకి రాకపోతే. లే! స్నానంచేసి టిఫెన్ తిను' అంటూ రమణారావు బయటకు వెళ్ళిపోయేడు.

సత్యం లోపలికి వెళ్ళాడు. అతని వెంట శాంతమ్మ కూడా వెళ్ళింది. టిఫెన్ తిని, పుస్తకంతో లైటు ముందు కూర్చొని, పాఠాలు చదువుకోసాగాడు సత్యం.

అలా చదువుకొంటున్న కొడుకుని చూసి ఎంతగానో మురిసిపోయింది శాంతమ్మ.

ఎనిమిది గంటలు అవగానే చదువు ముగించి, భోజనం చేసి నిద్ర పోయేడు సత్యం. నిద్రలో అతనికి ఒక కల వచ్చింది ఆకాశంలో నక్షత్రాలు. మధ్యలో ఒక స్త్రీ రూపం. నగలు పెట్టుకొని, కంట నీరు కారుస్తూ వచ్చింది.

'నాయనా! సత్యం!' అంటూ పిలిచింది.

## " శుభాకాంక్షలు "

**51** సంవత్సరం దిగ్విజయంగా గడిపి 52వ సంవత్సరములోకి అడుగు పెట్టబోతూన్న మా అందరి హృదయాలనూ చూరగొన్న మా ''కథాంజలి''కి ఇవే! మా సుమాంజలులు.

మానవునికి, మానుకు జర మరణాలుండొచ్చు గానీ, పత్రికకు మాత్రం పుట్టుకవే గాని చావు అనేది వుండరాదు. 'కథాంజలి' కన్నా పేరొందిన అప్పటి ఎన్నో పత్రికలు (పేరు ఇక్కడ ప్రస్తావించను) ఇపుడు మచ్చుకకు గూడా కానరావు. గానీ మన 'కథాంజలి' మాత్రం ప్రారంభం నుంచీ ఇప్పటి వరకూ ఎన్ని ఒడిదుడుకులయినా, ఎన్ని అవాంతరాలు వచ్చినా ఆగక వస్తూనే వుంది. దీనిన్నిబట్టి ఎడిటరుగారు సామాన్యులు కాదని, దీని వెనుక వారి కృషి ఎంతగానో వుందని మనం గ్రహించగలం! ఈ విషయంలో వారిని నేను అభినందించకుండా వుండలేను! వీరిని మనం సత్కరించినా వారికృషి ముందు మన సత్కారం వెలవెలాబోతూంది. ఇది ముమ్మాటికీ నిజం! భగవంతుడు వీరికి ఆయురారోగ్యములు ప్రసాదించు గాక!

-ప్రవీణ్‌సుశ్రీ, బెల్లంపల్లి.

---

'ఎవరమ్మా నువ్వు? ఎందుకు యిలా ఏడుస్తున్నావ్?' అన్నాడు సత్యం.

'నేను సత్యదేవతని నాయనా! ఈనాడు నువ్వు చేసిన తప్పుకి' అంది సత్యదేవత.

'నేనేం తప్పు చెయ్యలేదే?' అన్నాడు సత్యం.

'చేయలేదూ? బాగా ఆలోచించు. కొడుకు తప్పు చేస్తే తల్లి సరిదిద్దాలి. అందుకే నేను వచ్చేను. నీ పేరు సత్యం కదూ! ఇంతవరకు నువ్వు సత్యమే పలికేవు. ఈనాడు మాత్రం నీ తల్లిదండ్రుల దగ్గర అసత్యాన్ని పలికి నీ పేరు పోగొట్టుకొన్నావ్? నిజమేనా? ఇలా అసత్యం పలుకవచ్చా?' అంది సత్యదేవత.

దాంతో సత్యం తాను చేసిన పనికి భయపడ్డాడు. బిక్క మొహం వేసి 'పలుకకూడదమ్మా!' అన్నాడు.

'అయితే మరి ఎందుకు పలికావు?' అంది సత్యదేవత.

'భయంవల్ల' అంటూ జవాబు యిచ్చాడు సత్యం. 'అదే తప్పు. నిజం చెప్పి శిక్ష అనుభవించాలి. తెలుసా? అసత్యం పలికినప్పుడు నీ ఒళ్లు వణికింది కదూ? భయంతో బెదిరావు. చూశావా! అది ఎంత భయంకరమయిందో? నువ్వు ఈ రోజు స్నేహితులతో దొంగతనంగా మ్యాటనీ సినిమాకు వెళ్ళి, స్కూలు ప్రయివేటు మానివేశావు! ఏం? అసత్యం ఆడరాదు. సత్యమే పలకాలి అన్న నీతిని కూడా మరిచిపోయావు. ఇది తప్పే కదూ! ఇలా చిన్నతనంలో అబద్ధాలు ఆడటం నేర్చుకొంటే, పెద్ద అయ్యాక ఎంతో పాడైపోతావు. అందరూ నిన్ను అబద్ధాల కోరు అని అంటారు. అప్పుడు నువ్వు నిజం చెప్పినా నమ్మరు. నువ్వు యింకా చిన్నవాడివి. ఈ చేసిన తప్పుని యిప్పుడే సరిదిద్దుకో. చూడు!...సత్యం పలుకడంలో ప్రాణాలు పోయినా సరే లెక్క చేయకూడదు. సత్యహరిశ్చంద్రుని కథ చదివావు కదూ! అతడు ఎన్ని కష్టాలు పడినా సరే అసత్యం పలుకలేదు. ఆలాగే నువ్వు కూడా వుండాలి. పది మంది నిన్ను చూసి మంచిని నేర్చుకోవాలి. అప్పుడే నీకు మంచి పేరు వస్తుంది. ఏమంటావ్?' అంది సత్యదేవత.

'క్షమించమ్మా! తెలియక చేశాను. ఇంక ఎప్పుడూ అబద్ధాలు చెప్పను' అంటూ కళ్ళ నీరు కార్చాడు సత్యం.

'అదీ బుద్ధిమంతుల లక్షణం చూడు! నువ్వు నిజంగా ఎంతో మంచివాడివి!' అంటూ దీవించి మాయమయింది సత్యదేవత.

సత్యం ఉదయం నిద్రలేచేడు. తండ్రితో తాను క్రిందటి సాయంత్రం అబద్ధం ఆడేనని, రాత్రి నిద్రలో జరిగింది అలా చెప్పి, తనకు తగిన శిక్ష వేయమన్నాడు.

కుమారుని మంచి బుద్ధికి మెచ్చుకొని, రమణారావు 'సత్యం! నీ తప్పు నువ్వు తెలుసుకొని బాధ పడుతున్నావు. దానికి మించిన శిక్ష నీకు వేరే లేదు. నువ్వు యికనుంచి సత్యవంతుడవై, తోటి పిల్లలకు ఆదర్శంగా వుండు. నీ తప్పు ఒప్పుకొని నిజం చెప్పినందుకు ఇదిగో బహుమతి!' అంటూ అయిదు రూపాయల కాగితాన్ని యిచ్చేడు. సత్యం ఆ బహుమతి చూసి ఎంతో మురిసిపోయేడు. శాంతమ్మ ఎంతో ఆనందించింది.

# మాస్టరు చెప్పిన కథ

★



రచన: శ్రీ కవుల ఆంజనేయశర్మ

రామయ్య ఆ వూరిలో పేరు పొందిన రైతు. పంటలు పండించటంలోను, విత్తనాలు ఎంచి దాయటంలోను అతనికి అతనే సాటి. ఏ భోగట్టా కావలసినా రామయ్యను సలహా అడక్కుండా వుండరు ఆ వూళ్ళో వాళ్ళు. అధికార్లు కూడా అప్పుడప్పుడు వచ్చి రామయ్యతో మాట్లాడిపోతారు. మంచి అనుభవం కలిగి, ఎక్కువ పంట పండిస్తూ. ప్రభుత్వం ఆదరణ. ఆ ఊళ్ళో వారి సహాయము సంపాదించాడు రామయ్య. దాంతో అతనికి మంచి పేరు వచ్చింది.

ఒక సంవత్సరం తన పొలంలో గోధుమపంట నాటేడు రామయ్య. అదృష్టంకొద్దీ ఆ సంవత్సరం పొలాలన్నీ బాగా పండాయి. వెన్నులతోవుండే ఆ మొక్కలు గాలికి వూగుతూ వుంటే చూడ్డానికి ఎంతో ముచ్చటగా వుంది. ఉత్తరం పక్క పొలం బాగా పండంది. వెన్నులన్నీ బరువెక్కి వాలిపోయేయి. ఆ పొలం మధ్యలో ఒక పక్షి గూడు కట్టుకొని రెండు గుడ్లు పెట్టింది. గోధుమ వెన్నుల్లు పండి తలలు వాల్చటం, పక్షిగుడ్లు పగిలి పిల్లలవ్వడం రెండూ ఒకేమారు జరిగాయి వెన్నుల బరువుకు మొక్కలు నడుం వాల్చేయి. పక్షిపిల్లలు ఆ చేలో పెరుగుతూ వున్నాయి.

ఓనాడు రామయ్య పొలాలు చూసుకుంటూ, పక్షిపిల్లలు వున్న ఉత్తర పొలం దగ్గరకు వచ్చాడు కొడుకుతో. అన్ని పొలాలు యింకా పంటకు రాలేదు. ఉత్తర పొలం మాత్రం పండి కోతకు సిద్ధంగా వుంది. పొలం చుట్టూ తిరిగిచూశారు యిద్దరూ. తన అదృష్టానికి పొంగిపోయేడు రామయ్య. కొడుకుని పిలిచాడు—'ఈ పొలం బాగా పండిందిరా! నిజంగా మనం అదృష్టవంతులం. రేపు కూలీలను పిలిచి కోత కోయించు.' అన్నాడు.

'సరే!' అన్నాడు కొడుకు.

ఇద్దరూ యింటికి వెళ్ళిపోయేరు.

సాయంకాలం అయింది. సూర్యుడు అస్తమించాడు. చీకటి పడుతోంది. తల్లి పక్షిగూడు చేరుకుంది. తెచ్చిన ఆహారాన్ని పిల్లలికి అందించింది. కొంత సేపయ్యాక పక్షి పిల్లలు తల్లితో యిలా అన్నాయి—'అమ్మా! అమ్మా! ఈ ఈ పొలం రైతు కొడుకుతో వచ్చి చూసేడు. రేపు ఉదయాన్నే కూలీల్ని పిలిచి పొలం కోయిస్తాడట! నిజంగా వస్తే మనం వాళ్ళకి దొరికి పోతాముగా! ఎక్కడికయినా పోదామమ్మా!' అని.

తల్లి పక్షి అంది—భయపడకండర్రా! ఎవరయితే తన పని స్వయంగా చేసుకోక, యితరులపై ఆధారపడి వుంటారో, వారి పని తొందరగా పూర్తి అవదు. మీరేం భయపడకండి!' అని.

ఆ మాటతో పక్షి పిల్లలకి ధైర్యం వచ్చింది. రైతు కొడుక్కి కూలీలు దొరకలేదు. పొలం కోత జరగలేదు.

కొన్నాళ్ళయింది. రామయ్య కొడుకుతో వచ్చి పొలం చూసేడు. మొక్కలు బాగా నేలకు వాలి నిద్ర పోతున్నట్లున్నాయి. కొడుకుని పిలిచాడు.

'ఏరా! కూలీలను పిలవమంటే ఊరుకొన్నావు. చూడు! మొక్కలు ఒక దానిమీద ఒకటి ఎలా పడ్డాయో!...' అన్నాడు.

'కూలీలు దొరకలేదు. అందువల్ల వూరుకొన్నాను!' అన్నాడు కొడుకు,

'ఈసారి మనచుట్టాల్ని, బంధువుల్ని పిలిచి కోయించు. ఆ డబ్బు వాళ్ళకే యివ్వొచ్చు!' రామయ్య అన్నాడు.

సాయంకాలానికి తల్లిపక్షి తిరిగి గూడు చేరింది పక్షి

**Smt. R. LAKSHMAMMAL**



**20-7-1923 27-7-1990**

Gone Are The Golden Days in Mind a Constant Memory in Heart a Silent Tear.

You Always Live With us Through Your Love, Affection, Kindness and Virtues.

You Showed us the way. We Carry on The March In yoor Golden Path With Your Blessings. Loving ones.

4. A. R. Ramaprasad (Enfield) (son).

Sugandi prasad (Daughter in Law).

SathyaBhama (Grand Daughter)

పిల్లలు అరుస్తూ 'అమ్మా! రైతు వచ్చేడు మళ్ళీ కొడుకుతో. తన బంధువుల్ని, చుట్టాల్ని పిలిచి కోయించమన్నాడు.

కొడుకు 'సరే!' అని వెళ్ళిపోయాడు.

'రేపు గాని వస్తారేమో?' అన్నాయి పక్షిపిల్లలు.

'మరేం భయం లేదు. ఎవరయితే తన బంధువుల మీద, చుట్టాం మీద ఆధారపడి పనిని చేసుకోవాలనుకొంటారో, వాళ్ళపని తొందరగా పూర్తి అవదు!' అంది తల్లిపక్షి.

బంధువులు గాని, చుట్టాలు గాని పొలం కోతకు రాలేదు. మరి కొన్నాళ్ళయింది. రామయ్య పొలం చూడ్డానికి కొడుకుతో వచ్చాడు. గోధుమ కంకులన్నీ పొలంలోని మట్టికి అతుక్కుపోయాయి. రామయ్యకు ఎంతో బాధ కలిగింది. ఇతరులపై ఆధారపడితే యిలాగే వుంటుందని అనుకొన్నాడు.

'రేపు మనం యిద్దరం వచ్చి కోసేద్దాం! ఏమంటావ్?' అన్నాడు కొడుకుతో.

'సరే! అనుకొన్నారు.

సాయంత్రం అయింది. తల్లి పక్షిగూడు చేరింది. పక్షిపిల్లలు సంగతి అంతా తల్లితో చెప్పేయి.

'ఇతరులపై ఆధార పడకుండా. తన పనిని తానే చేసుకొంటున్నాడు రామయ్య. పని పూర్తవుతుంది. ఇక మనం ఈ పొలం వదలి పోదాం!' అంది తల్లిపక్షి.

పక్షిపిల్లలకు రెక్కలు బాగా వచ్చేయి ఎగరటానికి. సంతోషంతో ఆ పొలం వదిలి మరోచోటుకి ఎగిరిపోయింది తల్లిపక్షి పిల్లలతో.

రామయ్య, కొడుకు పొలాన్ని కోసి, గోధుమలు ఇంటికి చేర్చుకొన్నారు.

అందుకే అంటారు - 'ఎవరి పని వారే చేసుకోవాలని!'

★